
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
గురువారం 10 ఏప్రిల్ 2025
జిల్లాల వార్తలు



స్టేడియాలు మంజూరయ్యేనా?

సంగారెడ్డి జిల్లాలో నాలుగు చోట్ల ఏర్పాటుకు చర్యలు

ప్రభుత్వానికి ప్రతిపాదనలు

7



నెల రోజులకే తారుమారు

అధ్వానంగా స్టేషన్ మాసాయిపేట - నాచారం రోడ్డు


నాసిరకం పనులతో దెబ్బతిన్న బీటీ

గ్రామ సడక్ యోజన పనులపై పర్యవేక్షణ లోపం



తూప్రాన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా తూప్రాన్ మండలం స్టేషన్ మాసాయిపేట నుంచి సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం వరకు ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన - 3 పథకం కింద వేసిన రోడ్డు నెలరోజులకే అధ్వానంగా మారింది. స్టేషన్ మాసాయిపేట 44వ జాతీయ రహదారి నుంచి మాసాయిపేట, ఇస్లాంపూర్, దాతర్‌పల్లి, గుండ్రెడ్డిపల్లి, వెంకటాయపల్లి మీదుగా నాచారం వరకు రూ.5.17 కోట్లతో 9.50 కిలోమీటర్లు తారు రోడ్డును వేశారు. గతేడాది చేపట్టిన పనులు నత్తనడకన సాగాయి. ఇటీవల బీటీ (తారు) రోడ్డును పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. అయితే, నెలరోజుల్లోనే నాణ్యత లోపాలు కనిపించాయి. అడుగు అడుగుకు దెబ్బతిని తారు లేచింది. పదికాలాల పాటు నిలవాల్సిన రోడ్డు నెలరోజుల్లోనే దెబ్బతినడం పట్ల ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారీ వాహనాలుప్రయాణిస్తే తారు రోడ్డు పూర్తిగా దెబ్బతింటుందని వాపోతున్నారు. రోడ్డును నాణ్యతతో మళ్లీ నిర్మించకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

దాతర్‌పల్లి శివారులో నాణ్యత లోపంతో దెబ్బతిన్న రోడ్డు, ఇస్లాంపూర్ శివారులో లేచిన తారు



ఇస్లాంపూర్ శివారులో దెబ్బతిన్న రోడ్డు

పేదలు సన్నబువ్వ తినడమే ప్రభుత్వ లక్ష్యం

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



రమావత్ పీరియా ఇంట్లో భోజనం చేస్తున్న కలెక్టర్

టేక్మాల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పేదవాళ్లు సన్నబువ్వ తినడమే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చౌక ధరల దుకాణాల ద్వారా ఆహార భద్రత కార్డుదారులకు ఉచిత సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. బుధవారం టేక్మాల్ మండలంలోని చంద్రుతండాలో రమావత్ పీరియా ఇంట్లో సన్న బియ్యంతో వండిన ఆహారాన్ని వారి కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలందరికి పూర్తిస్థాయిలో ఆహార భద్రత కల్పించడమే ప్రజాప్రభుత్వం ధ్యేయమన్నారు. కార్డుదారులకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీతో పేదల కళ్లలో ఆనందాన్ని తాను స్వయంగా చూశానని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. జిల్లాలోని అన్ని చౌకధరల దుకాణాలకు సన్న బియ్యం స్టాక్ చేరినట్లు తెలిపారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. లబ్ధిదారుల కుటుంబసభ్యులతో కలిసి సహపంక్తి భోజనం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. భోజనం అనంతరం కలెక్టర్ రమావత్ పీరియా కుటుంబసభ్యులను సన్మానించి స్వీట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, తహసీల్దార్ తులసీరామ్, ఎంపీడీవో విఠల్ తదితరులు పాల్గొన్నారు.

ముజ్రా పార్టీలో సంగారెడ్డి జిల్లా నేత?

- ఎస్‌వోటీ పోలీసుల అదుపులో..
- రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ముజ్రా పార్టీలో సంగారెడ్డి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధి ఉన్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని ఏతబర్‌పల్లి గ్రామ శివారులో ఓ ఫాంహౌజ్‌లో పుట్టిన రోజు వేడుకల పేరిట మంగళవారం అర్ధరాత్రి ముజ్రా పార్టీని నిర్వహించారు. ఎస్‌వోటీ పోలీసుల దాడి చేసి దాదాపు 20 మందిని అరెస్టు చేశారు. అందులో యువతీయువకులు ఉండగా, సంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ నాయకుడు ఉన్నట్లు తెలిసింది. జిల్లా పరిషత్‌కు సంబంధించి నామినేటెడ్ పరంగా ఎన్నుకున్న సదురు ప్రజాప్రతినిధితో పాటు పలువురు యువకులు పాల్గొన్నట్టు తెలిసింది. ఈ విషయం జిల్లాలోని రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

మా గతేంటి?

జీజీహెచ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆవేదన

విధుల్లో కొనసాగిస్తారా.. తొలగిస్తారా?

ఈ ఏడాది వెలువడని రెన్యూవల్ ఉత్తర్వులు

ప్రశ్నార్థకంగా వైద్య ఉద్యోగుల జీవితాలు



సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కొన్నేళ్లుగా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ వైద్య ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వం నుంచి వారి విధుల కొనసాగింపునకు సంబంధించి రెన్యూవల్ ఉత్తర్వులు వెలువడకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతున్నది. తమ గతేంటని ప్రశ్నిస్తున్నారు.

పది రోజులవుతున్నా..

తెలంగాణ వైద్య విధాన పరిషత్(టీవీవీపీ) పరిధిలో ఇన్నాళ్లు సంగారెడ్డిలోని జిల్లా ఆస్పత్రి కొనసాగింది. మూడేళ్ల క్రితం జిల్లా ఆస్పత్రిని టీవీవీపీ నుంచి వైద్య విద్య సంచాలకులు(డీఎంఈ)పరిధిలోకి బదిలీ చేయడంతో జీజీహెచ్‌గా రూపాంతరం చెందింది. వాస్తవానికి ఔట్‌సోర్సింగ్ కింద పనిచేసే ఏ క్యాడర్ ఉద్యోగులదైనా ప్రతీ ఏడాది మార్చి 31వ తేదీతో గడువు ముగుస్తుంది. తిరిగి వారి విధుల కొనసాగించాలంటే సంబంధిత శాఖ ఉన్నతాధికారుల నుంచి పొడిగింపు(రెన్యూవల్) ఉత్తర్వులు వెలువడుతాయి. కానీ ఏప్రిల్ 10వ తేదీ వచ్చినప్పటికీ ఇప్పటి వరకు టీవీవీపీ కింద జీజీహెచ్‌లో పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించిన రెన్యూవల్ ఉత్తర్వులు వెలువడలేవు. అయితే ఈ ఆస్పత్రిలో సుమారు 13 మంది వైద్య సిబ్బంది వివిధ క్యాడర్లలో విధులు నిర్వర్తిస్తున్నారు. వారిలో ఎల్‌టీలు-3, రేడియోగ్రాఫర్లు-4, ఎలక్ట్రిషన్-2, ప్లంబర్-1, కార్‌పేయింటర్-1, ఈసీజీ టెక్నీషియన్-1, సీ-ఆర్మ్ టెక్నీషియన్-1 విధులు నిర్వహిస్తున్నారు.

15 ఏళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులు

రాష్ట్ర వ్యాప్తంగా పలు టీవీవీపీ ఆస్పత్రులు డీఎంఈ పరిధిలోని వచ్చిన తర్వాత రెగ్యులర్ నియామకాలు జరగడంతో ఒక్కో క్యాడర్ వారిని విధుల నుంచి తొలగిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే జీజీహెచ్‌లోనూ పలువురు వైద్య ఉద్యోగులను తొలగించారు. తాజాగా 13 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల విధులకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి రెన్యూవల్ ఉత్తర్వులపై స్పష్టత రాకపోవడంతో అటు అధికారులు, ఉద్యోగులు అంతర్మథనంలో పడ్డారు. తమ ఉద్యోగాలను కొనసాగిస్తారా, లేక విధుల నుంచి టర్మినేట్ చేస్తారా అన్న ఆందోళనతో సతమతమవుతున్నారు. ఒక వేళ టర్మినేట్ చేస్తే 15 ఏళ్లుగా పనిచేస్తున్న వారి ఉద్యోగ జీవితాలు ప్రశ్నార్థకంగా మారనున్నాయి. ఇదే విషయమై టీవీవీపీ, జీజీహెచ్ అధికారులను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఇప్పటివరకు పొడిగింపు ఉత్తర్వులు కానీ, తొలగింపు ఆదేశాలు రాలేవని సమాధానమిచ్చారు.



డయాలసిస్ పేషెంట్లకు 'ఆసరా'

- పెన్షన్ కోసం కొత్త దరఖాస్తులు స్వీకరణ



సంగారెడ్డిలోని జీజీహెచ్ డయాలసిస్ కేంద్రంలో చికిత్స పొందుతున్న డయాలసిస్ పేషెంట్లు(ఫైల్)

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : జీవన శైలిలో మార్పులతో చాలా మంది మూత్రపిండాల వ్యాధుల బారిన పడి వైద్యం కోసం ఆపసోపాలు పడుతున్నారు. పలువురు ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. కిడ్నీ బాధితుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వం ఆసరా పింఛన్‌ను అందించింది. సంగారెడ్డి జిల్లాలో 156 మంది డయాలసిస్ బాధితులు ఆసరా పింఛన్‌ను పొందుతున్నారు. తాజాగా ప్రభుత్వం మరోసారి కొత్త డయాలసిస్ పేషెంట్ల నుంచి పింఛన్ కోసం దరఖాస్తుల స్వీకరణకు చర్యలు చేపట్టింది. ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా ఆస్పత్రుల్లోని ఆరోగ్య మిత్రలు డయాలసిస్ రోగుల వివరాలు సేకరించి అప్‌లోడ్ చేస్తున్నారు. ఈవారంలో దరఖాస్తు ప్రక్రియ ముగియనుందని అధికారులు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలోని ఎనిమిది ప్రభుత్వాస్పత్రుల్లో సుమారు 350 మంది డయాలసిస్ పేషెంట్లు ఆయా చోట్ల రక్తశుద్ధి చేసుకుంటున్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద డయాలసిస్ చేసుకుంటున్న బాధితులకు మాత్రమే ఆసరా పింఛన్‌కు అర్హులని ట్రస్టు అధికారులు తెలిపారు. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మరికొంత మంది డయాలసిస్ రోగులకు త్వరలో పింఛన్ అందనుంది.

విజయ పథాన పాడి

రైతులకు ప్రోత్సాహకాలు

పాడిరైతులకు సంక్షేమ పథకాలు

తాజాగా పాల సేకరణ ధర పెంపు

ఈ నెల ఒకటి నుంచి వర్తింపు

7

2,150 సెల్‌ఫోన్లు రికవరీ చేశాం

మొబైల్ పోగొట్టుకుంటే సీఈఐఆర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి

వ్యక్తిగత సమాచారం సెల్‌ఫోన్లలో నిక్షిప్తం చేయొద్దు

ఆన్‌లైన్ బెట్టింగ్ మాటున సైబర్ నేరగాళ్లు

సంగారెడ్డి ఎస్పీ పంకజ్



బాధితులకు సెల్‌ఫోన్ అందజేస్తున్న సంగారెడ్డి ఎస్పీ పంకజ్

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇప్పటివరకు 2150 సెల్‌ఫోన్లను రికవరీ చేశామని సంగారెడ్డి ఎస్పీ పంకజ్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం మొబైల్ రికవరీ మేళాను నిర్వహించారు. అందులో భాగంగా 332 మంది బాధితులకు ఎస్పీ సెల్‌ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ పంకజ్ మాట్లాడుతూ సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే సీఈఐఆర్ పోర్టల్‌లో వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. చోరీకి గురైన, పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల రికవరీ కోసం జిల్లా ఐటీ సెల్ సిబ్బందితో స్పెషల్ బృందాలను ఏర్పాటు చేసి, ప్రత్యేకంగా దృష్టి సారించామని తెలిపారు. సీఈఐఆర్ పోర్టల్ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు నమోదు చేయబడిన 9,878 దరఖాస్తులలో 2,150 ఫోన్లను గుర్తించి, ఇదివరకే బాధితులకు అందించడం జరిగిందని తెలిపారు. ఇందులో గత 15 రోజుల క్రితం ఏర్పాటు చేసిన స్పెషల్ టీమ్స్ ద్వారా 332 సెల్‌ఫోన్‌లను రాష్ట్రంలోనే కాకుండా పొరుగు రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల నుంచి రికవరీ చేసినట్లు ఎస్పీ వివరించారు. ఎవరైనా సెకండ్‌హ్యాండ్ మొబైల్ ఫోన్‌లను కొనుగోలు చేసినట్లైతే ఆషాప్ యజమాని నుంచి రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఎవరైన దొంగిలించబడిన ఫోన్ అని తెలిసి కూడా కొనుగోలు చేసినట్లైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు. వ్యక్తిగత, ఇతర విలువైన సమాచారాన్ని మొబైల్‌లో సేవ్ చేయొద్దని సూచించారు. ఆన్‌లైన్ బెట్టింగ్, యాప్స్ మాటున సైబర్ నేరగాళ్లు పొంచి ఉన్నారని ఎస్పీ పంకజ్ తెలిపారు. సైబర్ నేరాల గురించి అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలకు గురైనట్లైతే వెంటనే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. సెల్‌ఫోన్లను రికవరీ చేయడానికి కృషి చేసిన సైబర్ విభాగం సీఐ కిరణ్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ రాజలింగం, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

'స్వచ్ఛ భారత్' మిగులు నిధులు వెనక్కు

- మెదక్ జిల్లాలోని రూ.1.70 కోట్లు కేంద్ర ఖాతాలోకి
- ఇప్పటికీ 1.25 కోట్లు జమ

మెదక్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ భారత్ మిషన్‌కు సంబంధించిన మిగులు నిధులను వెనక్కు పంపించాలని ఈ పథకం అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పల్లెల్లో సంపూర్ణ పారిశుధ్యానికి ఇంటింటా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2016-17 సంవత్సరంలో స్వచ్ఛ భారత్ మిషన్ పథకాన్ని ప్రవేశపెట్టింది. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం ప్రారంభం సమయంలో రూ.6 వేలు చెల్లించారు. నిర్మాణం పూర్తయిన తర్వాత లబ్ధిదారులకు మరో రూ.6 వేలు చెక్కు రూపంలో అందించారు. 2019లో వందశాతం ఓడీఎఫ్‌గా మెదక్ జిల్లాను ప్రకటించారు. దాంతో గ్రామాలకు కేటాయించిన లక్ష్యం పూర్తి కావడంతో ప్రభుత్వం కేటాయించిన నిధుల్లో కొంత మేరకు మిగిలిపోయాయి. ప్రస్తుతం మిగిలిన నిధులు వెనక్కి పంపించాలని ఈ పథకం ఉన్నతాధికారులు ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 469 గ్రామాల నుంచి రూ.1.70 కోట్లు కేంద్ర ఖజానాకు జమ చేయడానికి జిల్లా పంచాయతీ అధికారులు పూనుకున్నారు. ఇప్పటి వరకూ రూ.1.25 కోట్లను సంబంధిత ఖాతాలో జమ చేశారు. మిగతా డబ్బు వీలైనంత త్వరగా బదిలీ చేయాలని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మొన్నటివరకు ఆర్థిక సంవత్సరం ముగియడం, మధ్యలో వరుస సెలవులు రావడంతో కొంత మేరకు ఆలస్యమైందని ఆయన పేర్కొన్నారు.

పదికి పది ఎమ్మెల్యే స్థానాలు సాధిస్తాం

కాంగ్రెస్ 58, 59 జీవోని బొంద పెట్టింది

హైడ్రా పేరుతో వెల్లకిలా పడ్డారు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

బీఆర్‌ఎస్ పాదయాత్ర విజయవంతం

పటాన్‌చెరు రూరల్/గుమ్మడిదల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని పదికి పది ఎమ్మెల్యే స్థానాలు సాధిస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. రుద్రారం గణేష్‌గడ్డలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలకులు 58, 59 జీవోని బొంద పెట్టారని మండిపడ్డారు. ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేస్తామని చెప్పి ప్రజల నుంచి ఎల్‌ఆర్‌ఎస్ రుసుం పేరిట భారీగా దోపిడీ చేస్తున్నదని ధ్వజమెత్తారు. హైడ్రా పేరుతో ఆరు నెలలు పరుగుతీసి, వెల్లకిలా పడ్డాడని ఎద్దేవా చేశారు. రాష్ట్ర వృద్ధిరేటు సగానికి పడిపోయిందన్నారు. దేశం 15 శాతం జీఎస్టీ వృద్ధి రేటు సాధిస్తే తెలంగాణ కేవలం 5 శాతం మాత్రమే సాధించిందని తెలిపారు. రాష్ట్రంలో తీవ్ర విద్యుత్ సంక్షోభం నెలకొందని ఆరోపించారు. పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలో వారానికి రెండు రోజులు పవర్ హాలిడే వచ్చేదని, కేసీఆర్ వచ్చాక 24 గంటలు నాణ్యమైన విద్యుత్ ఇచ్చారని గుర్తు చేశారు. ఈనెల 27వ తేదీన వరంగల్‌లో జరిగే భారీ బహిరంగ సభను కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పాదయాత్ర విజయవంతం

అంతకుముందు బీరంగూడ నుంచి రుద్రారం గణేష్ గడ్డ వరకు బీఆర్‌ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గం ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర విజయవంతంగా కొనసాగింది. భారీ సంఖ్యలో కార్యకర్తలు ఈ పాదయాత్రలో పాల్గొని ఆదర్శ్‌రెడ్డికి సంఘీభావం తెలిపారు. హరీష్‌రావుతో పాటు, శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారి ఆలయంలో ఆదర్శ్‌రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, కార్పొరేటర్ సింధుఆదర్శ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ గుమ్మడిదల మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, రుద్రారం మాజీ సర్పంచ్ సుధీర్‌రెడ్డి, నాయకులు రామిరెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గ నేతలు తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, పాదయాత్ర చేస్తున్న పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి

చట్టాలపై అవగాహన

నర్సాపూర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్‌పర్సన్ లక్ష్మీశారద ఆదేశాల మేరకు మండలంలోని రెడ్డిపల్లిలో డ్వాక్రా మహిళలకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్యవివాహాలు, బాలకార్మికులు,పోక్సో చట్టం తదితర అంశాలతో పలు చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాస్‌గౌడ్, ఎ.శ్రీనివాస్, స్వరూప, రాజు,సుధాకర్, ఏపీఎం గౌరిశంకర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

చాప్టా.కెలో అంగన్‌వాడీ స్కూల్‌డే

నారాయణఖేడ్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చాప్టా.కె లో బుధవారం అంగన్‌వాడీ స్కూల్‌డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ మంజుల మాట్లాడుతూ అంగన్‌వాడీ చిన్నారుల్లో నైపుణ్యం పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడాతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల గెజిటెడ్ హెచ్‌ఎం నర్సింహులు, ప్రాథమిక హెచ్‌ఎం ఎంగ్రాం, అంగన్‌వాడీ టీచర్ జగదేవి, బాబురావు, హరిసింగ్, హెల్త్ ఆఫీసర్ విజయక్రిష్ణరెడ్డి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ



నాగల్‌గిద్ద, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శిఖార్ ఖానా గ్రామంలో బుధవారం లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీలర్ సంఘం మండల అధ్యక్షుడు గడ్డ సంగ్ శెట్టి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సన్నబియ్యం భోజనం చేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయన్నారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సచిన్‌పాటిల్, అనిల్‌పటేల్, డీలర్లు అమ్రేష్, శివకుమార్ పాల్గొన్నారు.

మహాత్మా జ్యోతిబా పూలే జయంతి ఏర్పాట్లు పూర్తి

● సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా జ్యోతిబా పూలే 199వ జయంతి వేడుకలకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11న ఉదయం సంగారెడ్డి పట్టణంలోని ఆర్అండ్‌బి కార్యాలయం పక్కన ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహానికి పూల మాలలు వేసి ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేశామన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించినానంతరం కల్వకుంట రోడ్డులో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సభలో సమాజిక న్యాయం, సమానత్వం పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించేలా ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు అధికారులు వివిధ సంఘాల నాయకులు, యువత, స్థానిక ప్రజలు కార్యక్రమానికి హాజరై జయంతిని విజయవంతం చేయాలని కలెక్టర్ క్రాంతి కోరారు.

అగ్నివీర్ దరఖాస్తులకు గడువు పొడిగింపు...

భారత సైన్యంలో అగ్ని కీటగిరిలో నియామకం కోసం వెలువరించిన దరఖాస్తుల గడువును ఈ నెల 25వ తేది వరకు పొడిగించినట్లు జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఓ ప్రకటనలో తెలిపారు. అగ్నివీర్ జూనిర్ కమిషన్డ్ అధికారులు, ఇతర హోదాల నియామకానికి సంబంధించిన ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ పరీక్షకు నమోదు చేసుకునేందుకు గడువును పొడిగించారన్నారు. ఆసక్తి, అర్హత గల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

నేడు ఆత్మ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారం

● హాజరుకానున్న మంత్రి దామోదర రాజనరసింహ



తిమ్మారెడ్డిగారి మల్లారెడ్డి

పుల్‌కల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం చక్రియాల గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తిమ్మారెడ్డిగారి మల్లారెడ్డి జోగిపేట డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్‌గా నేడు పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మంత్రి దామోదర రాజనరసింహ సిఫారసు మేరకు మల్లారెడ్డిని ఆత్మ కమిటీ చైర్మన్‌గా నియమిస్తూ ఇటీవల రాష్ట్ర వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులరాలు రమాదేవి ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. మల్లారెడ్డితో పాటు మరో 23 మంది సభ్యులుగా పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ శివారులోని ఓ ఫంక్షన్ హాలులో మధ్యాహ్నం 11 గంటలకు పదవీ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి దామోదర రాజనరసింహ హాజరుకానున్నారు.

ఎమ్మెల్యే పార్టీ వీడాక కార్యకర్తల్లో రెట్టించిన ఉత్సాహం

● బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శరెడ్డి



పాదయాత్ర చేస్తున్న ఆదర్శరెడ్డి, కార్పొరేటర్ సింధూ

రామచంద్రాపురం టౌన్ ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పార్టీ వీడిన తరువాత కార్యకర్తల్లో ఉత్సాహం రెట్టింపయిందని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శరెడ్డి, కార్పొరేటర్ సింధూ అన్నారు. బుధవారం రామచంద్రాపురం నుంచి పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామం గణేష్‌గడ్డ ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. నియోజకవర్గంలోని పార్టీశ్రేణులతో కలిసి రామచంద్రాపురం కూడలిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పార్టీని వీడిన తరువాత బీఆర్ఎస్ పని అయిపోయిందంటూ ప్రచారం చేశారని తెలిపారు. పాదయాత్ర నిర్వహణ సందర్భంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారని వివరించారు. కార్యక్రమంలో ఐడీఏ బొల్లారం మాజీ జడ్‌టీసీ సభ్యుడు బాల్‌రెడ్డి, తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, అమీన్‌పూర్ నాయకులు యూనూస్, గోపాల్, జగదీష్ తదితరులు ఉన్నారు.

14న సంగారెడ్డిలో మహార్యాలీ

సంగారెడ్డి రూరల్, ఏప్రీల్ 9 (ఆంధ్రజ్యోతి) : డా. బీఆర్. అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా ఈ నెల 14వ తేదిన సంగారెడ్డిలో మహార్యాలీ నిర్వహిచనున్నట్లు అంబేద్కర్ ఉత్సవ కమిటి చైర్మన్ అనంతయ్య, వైస్ చైర్మన్ పల్లె సంజీవయ్య తెలిపారు. ఈ మేరకు సంగారెడ్డిలోని ప్రభుత్వ అతిథి గృహంలో బుధవారం అంబేద్కర్ జయంతికి సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కొండాపురం జగన్, దుర్గాప్రసాద్, అశోక్, నందకిషోర్, నాగరాజ్, హనుమంతు, సునీల్, ఉదయ్, మోహన్, రాజు, సదానంతం, పురుషోత్తం, రవి, రాజు పాల్గొన్నారు.

శుభకార్యానికి వెళ్తూ.. మృత్యు ఒడికి..

● రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి..
● మరొకరికి తీవ్ర గాయాలు



వీరయ్య(ఫైల్)

మెదక్ కల్చరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : శుభకార్యానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన మెదక్ మండల పరిధిలోని తిమ్మక్కపల్లి గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. వెల్దుర్తి మండలం శెట్టిపల్లి గ్రామానికి చెందిన గడ్డం వీరయ్య(62), గడ్డం మల్లయ్య తమ స్వగ్రామం నుంచి మెదక్ వైపు బంధువుల పెళ్లికి బైక్‌పై వెళ్తున్నారు. మెదక్ మండలం తిమ్మక్కపల్లి శివారులోకి రాగానే వెనుకవైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం వీరి బైక్ బలంగా ఢీకొట్టింది. దీంతో వీరయ్య పక్కనే ఉన్న గుంతలోపడి అక్కడికక్కడే మృతి చెందగా, మల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు కొడుకులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మెదక్ పోలీసులు తెలిపారు.

'ఫైనాన్స్' వేధింపులకు యువకుడు బలి

● ఉరివేసుకుని ఆత్మహత్య



ప్రశాంత్(ఫైల్)

వెల్దుర్తి, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి) : ఫైనాన్స్ వారి వేధింపులు తాళలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలోని మానెపల్లిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మానెపల్లి గ్రామానికి చెందిన అక్కల లలిత, లచ్చయ్య దంపతుల ఏకైక కుమారుడు ప్రశాంత్(20) సుమారు ఏడాది క్రితం వెల్దుర్తిలోని ఓ షో రూంలో ఫైనాన్స్‌పై బైక్‌ను కొనుగోలు చేశాడు. బైక్ ఈఎంఐ సక్రమంగా చెల్లించకపోవడంతో ఫైనాన్స్ నిర్వాహకులు నాలుగు రోజుల క్రితం బైక్‌ను తీసుకెళ్లి వేధింపులకు పాల్పడ్డారు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన ప్రశాంత్ మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. బుధవారం ఉదయం వెతకగా తన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకొని కనిపించాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మతిస్థిమితం లేని వివాహిత అదృశ్యం



సరితాదేవి (ఫైల్)

ఐడీఏబొల్లారం ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితం లేని ఓ వివాహిత అదృశ్యమైన సంఘటన ఐడీఏబొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రం నలందా జిల్లా జగదీష్‌పూర్ గ్రామానికి చెందిన సరితాదేవి ఐడీఏబొల్లారం పట్టణ పరిధి బాలాజీనగర్‌లో నివాసం ఉంటున్నారు. కొంత కాలంగా ఆమెకు మతిస్థితిమితంగా లేదు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త బిర్జూషా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చిరుత దాడిలో లేగదూడ మృతి



మృతి చెందిన లేగదూడ

హవేళిఘణపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చిరుత దాడిలో లేగదూడ మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని బ్యాతోల్ గ్రామానికి చెందిన ఆశ రాజయ్య గ్రామ శివారులో రోజు మాదిరాగానే మంగళవారం రాత్రి ఆవు, లేగదూడను తన పశువుల పాకలో కట్టేసి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం వెళ్లి చూసే సరికి లేగదూడ మృతిచెంది కనిపించింది. చిరుత దాడి చేసి చంపినట్లు ఆనవాలు కనిపించడంతో కన్నీరుమున్నీరయ్యాడు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు అక్కడికి చేరుకుని పంచనామా నిర్వహించారు. నష్ట పరిహారం కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు వారు తెలిపారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎన్ఎస్‌యూఐ కృషి

● ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు హరీష్‌వర్ధన్



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నేతలు

నర్సాపూర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్‌యూఐ విద్యార్థుల హక్కుల సాధన, సామాజిక సేవ కోసం ఎప్పుడు పనిచేస్తూనే ఉందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు హరీష్‌వర్ధన్ తెలిపారు. బుధవారం ఎన్ఎస్‌యుఐ 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నర్సాపూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రభులింగం, కృష్ణారెడ్డి, నితీష్, సాయి, ఆంజనేయులు, రవి, దశరత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



మునిపల్లి : సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న నాయకులు

అల్లాదుర్గం,ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రైన అల్లాదుర్గంలో పలువురు లబ్ధిదారులకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేషారెడ్డి బుధవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● మునిపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 36మందికి సంబంధించి మంజూరైన రూ.17లక్షల 38వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్ లబ్ధిదారులకు అందజేశారు. ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ హరినందన్ రావు, మాజీ ఎంపీపీ రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ బుర్కల పాండు, మాజీ సర్పంచ్ విఠల్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తాటిపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఒప్పందం చేసుకుంటున్న వర్సిటీల ప్రతినిధులు

నూతన పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలి

ములుగు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను సాంకేతిక రంగంలో తీర్చిదిద్దడం కోసం కొత్త పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటున్నట్లు శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్ దండా రాజిరెడ్డి తెలిపారు. బ్లైండ్ కలర్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్లాస్టికల్చర్ మధ్య ములుగు శివారులోని వర్సిటీలో ఉపకులపతి డాక్టర్ దండా రాజిరెడ్డి ఒప్పందం కుదరింది. ఉద్యాన పంటలపై పరిశోధన, అభివృద్ధి శిక్షణలో సహకారాన్ని పెంపొందించడానికి ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్, బ్లైండ్ కలర్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ శుభం రవి, డీన్ ఆఫ్ హార్టికల్చర్, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ చీనానాయక్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ లక్ష్మీనారాయణ, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్, డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ డాక్టర్ సురేష్‌కుమార్, లైబ్రేరియన్ డాక్టర్ రాజశేఖర్, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రియల్ అండ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ శ్రీనివాస్, టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ వీణ జోషి, పీఆర్ఓ డాక్టర్ సతీష్ పాల్గొన్నారు.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వాయునందన్, తదితరులు

ప్రభుత్వ విధానాల్లో నైతిక విలువలకు ప్రాధాన్యం

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలసీల రూపకల్పనలో నైతిక విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని మహారాష్ట్రలోని యశ్వంత్‌రావు ఓపెన్ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ వాయునందన్ సూచించారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల జాతీయ సెమినార్‌లో భాగంగా సామాజిక శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో మొదటి రోజు బుధవారం 'ప్రభుత్వ విధానాల రూపకల్పన- నైతిక విలువల పాత్ర' అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విధాన రూపకల్పన రాజకీయ పాలన వ్యవస్థపై ఆధారపడి ఉంటుందని, ఇది అవినీతికి ఓటు బ్యాంకుకు అవకాశం లేకుండా వాస్తవ అభివృద్ధిని ప్రోత్సహించే విధంగా ఉండాలని తెలిపారు. సీసీఈ అకాడమీ గైడెన్స్ ఆఫీసర్ ప్రొ.బాల భాస్కర్, ఆజాద్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ నజీవుల, ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ మాట్లాడారు. అంతకుముందు సెమినార్ సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సెమినార్ కన్వీనర్ మల్లిక, అధ్యాపకులు విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.



మూల్యాంకన ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

మూల్యాంకనంలో పొరపాట్లు జరగొద్దు

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి మూల్యాంకనంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తగా ఉండాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సాగుతున్న పదో తరగతి మూల్యాంకన ప్రక్రియను బుధవారం ఆమె పరిశీలించారు. మూల్యాంకన కేంద్రం వద్ద తాగు నీరు ఇతర అన్ని సౌకర్యాలను సమకూర్చాలని డీఈఓ శ్రీనివాస్ రెడ్డికి సూచించారు.

కాచిగూడ-హిస్సార్ మధ్య 22 సమ్మర్ స్పెషల్స్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ-హిస్సార్ మధ్య 22 వేసవి ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈ నెల 17నుంచి జూన్ 26 వరకు ప్రతి గురువారం సాయంత్రం 4గంటలకు కాచిగూడ నుంచి, ఈ నెల 20 నుంచి జూన్ 29వరకు ప్రతి ఆదివారం రాత్రి 10 గంటలకు ఈ ప్రత్యేక రైళ్లు బయలుదేరుతాయని సీపీఆర్ఓ శ్రీధర్ తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్లలో అన్నీ ఏసీ త్రీటైర్ కోచ్‌లే ఉంటాయని, మార్గ మధ్యంలో మల్కాజిగిరి, మేడ్చల్, కామారెడ్డి, నిజామాబాద్, బాసర, ధర్మాబాద్, ముద్కేడ్, నాందేడ్ తదితర స్టేషన్లలో ఆగుతాయని పేర్కొన్నారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి ప్రయాణికులకు రిజర్వేషన్ సదుపాయం అందుబాట్లో ఉంటుందని సీపీఆర్ఓ తెలిపారు.

దగ్గరవుతున్న దూరవిద్య

వెలుగు దివ్వెగా అంబేడ్కర్ రీజనల్ స్టడీ సెంటర్

- గృహిణులకు, చిరుద్యోగులకు వరం
- ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులు
- ఆత్మీయ సమ్మేళనానికి సన్నాహాలు

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చదువుకోవాలని ఎవరికి మాత్రం ఉండదు. కానీ, వారి వారి ఆర్థిక, ఇతరత్ర పరిస్థితుల వల్ల చదువలేకపోతారు. ఉన్నత చదువులు చదివి, మంచి ఉద్యోగం సాధించాలి అని ప్రతి ఒక్కరు కలలుకంటారు. కొంతమంది చదివిన దానికి సంబంధం లేకపోయినా ఏదో ఒక ఉద్యోగం చేస్తుంటారు. చేస్తున్న ఉద్యోగంలో ఎదుగు బొదుగు లేదు ఇంకాస్త పెద్ద చదువులు చదివి ఉంటే బాగుండు. బాగా చదివి ప్రభుత్వ ఉద్యోగం చేయాలి, కానీ ఇంట్లో పెళ్లి చేశారు. ఇలా చాలా మంది వివిధ రకాల కారణాలతో చదువు మధ్యలో ఆపేయడమో, ఉద్యోగ బాధ్యతలతో ఉన్నత చదువులు చదవలేక నిరాశగా ఉన్నవారికి డా. బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం దూరవిద్య చిరునామగా మారింది. హైదరాబాద్ కేంద్రంగా అనేక జిల్లాలలో శాఖోపశాఖలుగా మారి వివిధ కోర్సులను అందిస్తూ, ఎంతోమందిని విద్యావంతులుగా తీర్చిదిద్దుతుంది.

సిద్దిపేటలో స్టడీ సెంటర్‌గా మొదలై..

1984లో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనంలో అంబేడ్కర్ స్టడీ సెంటర్ మొదలైంది. మొదట్లో యూజీ కోర్సులతో కేంద్రం ప్రారంభమైంది. 2005లో ప్రత్యేక నూతన భవనంలోకి మారింది. 2006లో యూజీతో పాటుగా పీజీ కోర్సులను అందుబాటులోకి తెచ్చారు. 2007లో స్టడీ సెంటర్ నుంచి రీజనల్ స్టడీ సెంటర్‌గా మారింది. హుస్నాబాద్, చేర్యాల, గజ్వేల్, నర్సాపూర్, మెదక్, జోగిపేట, సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్‌లోని అంబేడ్కర్ స్టడీ సెంటర్లు సిద్దిపేట రీజనల్ స్టడీ సెంటర్‌కు అనుబంధంగా పనిచేస్తున్నాయి. ప్రతి సంవత్సరం సగటున 1600 నుంచి 1800 మంది విద్యార్థుల అడ్మిషన్స్ ఎన్‌రోల్ అవుతున్నాయి. ఈ స్టడీ సెంటర్‌లో చదివిన ఎంతో మంది విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ప్రభుత్వ రంగాల్లోనే కాకుండా ప్రైవేట్ రంగంలో కూడా కొనసాగుతున్నారు. రాజకీయాల్లో కూడా రాణిస్తున్నారు. ఇటీవల విడుదలైన డీఎస్సీ గ్రూప్స్ ఫలితాల్లో కూడా అంబేడ్కర్ స్టడీ సెంటర్‌లో చదువుకున్న వాళ్లు ఉన్నారు. ప్రస్తుతం సిద్దిపేటలోని అంబేడ్కర్ ప్రాంతీయ విద్యా కేంద్రంలో యూజీ, పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. రాబోయే రోజుల్లో మరిన్ని కోర్సులు అందుబాటులో ఉంటాయి.



సిద్దిపేట అంబేడ్కర్ రీజనల్ స్టడీ సెంటర్

ఆత్మీయ సమ్మేళానికి ఏర్పాట్లు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అనేది సాధరణంగా పాఠశాలలు, కాలేజీల్లో చూస్తుంటాం. వినూత్నంగా సిద్దిపేట అంబేడ్కర్ రీజనల్ సడీ సెంటర్‌లో చదివిన పూర్వ విద్యార్థులతో అపూర్వ సమ్మేళనం చేపట్టాలని రీజనల్ కో ఆర్డినేటర్ డా. శ్రద్దానందం కార్యక్రమ రూపకల్పన చేశారు. ఈ సందర్భంగా దూరవిద్య ద్వారా విద్యనభ్యసించి ఉన్నతమైన పదవులను చేపట్టిన వారి సక్సెస్ స్టోరీలను పుస్తకరూపం తీసుకరావాలని ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 40 సంవత్సరాలుగా ఈ కేంద్రంలో చదివిన పూర్వ విద్యారుల వివరాలను సేకరిస్తున్నారు. సమావేశాలు ఏర్పాటు చేసి ప్రత్యేకంగా సెల్ నెంబర్‌లు, వాట్సప్ గ్రూప్‌లు క్రియేట్ చేసి అందరిని సమయాత్తం చేస్తున్నారు.

అంబేడ్కర్ దూరవిద్య వరం లాంటిది



చదువుకోవాలని ఆసక్తి ఉండి పరిస్థితుల కారణంగా చదువు దూరమైన వారికి అంబేడ్కర్ దూరవిద్య వరం లాంటింది. ఈ సెంటర్‌లో చదివిన వారు చాలామంది మంచి పొజిషన్‌లలో ఉన్నారు. 40 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ రీజినల్ సెంటర్‌లో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి ఏర్పాట్లు చేస్తున్నాం. త్వరలోనే ఓ నిర్ణయానికి వస్తాం.

డా. శ్రద్ధానందం, రీజనల్ స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్, సిద్దిపేట

మధ్యతరగతి వారికి ఓపెన్ యూనివర్సిటీ వరం



సిద్దిపేట స్టడీ సెంటర్‌లో బీఏ పూర్తిచేశాను. హెల్త్ అసిస్టెంట్‌గా ఉద్యోగం వచ్చింది. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ అందిస్తున్న డిస్టెన్స్ స్టడీస్ పేద మధ్య తరగతి వాళ్లకు చాలా బాగా ఉపయోగపడుతుంది. ఈ స్టడీ సెంటర్ లేకుంటే చదివే వాడిని కాదేమో.. దూరవిద్యలో చదివి ఉద్యోగం సాధించాను. నా జీవితం మారిపోయింది.

- బాల ఎల్లం, శానిటరీ ఇన్‌స్పెక్టర్, హుస్నాబాద్

వర్సిటీ నాకు చాలా ఇచ్చింది



1087-90 బ్యాచ్‌లో ఇక్కడ డిగ్రీ చదివాను. బీఈడీ చేసి 2000లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించాను. ప్రస్తుతం కుకునూరుపల్లి పాఠశాలలో తెలుగు భాషోపాధ్యాయుడిగా పని చేస్తున్నా. ఇప్పటి వరకు 200 పాఠశాలలో బాల సాహిత్య కార్యశాలలు చేసాను. ఇప్పటి వరకు 55 పుస్తకాలు రాసాను, అచ్చు వేయించాను. అందులో పిల్లలవే ఎక్కువ. ఇదంత కూడా ఓపెన్ యూనివర్సిటీ బిక్షే అని గర్వంగా చెప్పుకుంటాను.

-వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, కుకునూరుపల్లి

ఘనంగా వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపన



సర్వేశ్వర అంబిక శివయోగిని సన్మానిస్తున్న నాయకులు

రేగోడ్, ఏప్రిల్ 9. (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆర్. ఇటిక్యాల గ్రామంలో ఏర్పాటు చేసిన వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం బుధవారం కనుల పండుగగా జరిగింది. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవం దుద్యాల సర్వేశ్వర మఠం శ్రీహరి అంబిక శివయోగి స్వామి చేతుల మీదుగా అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయంలో ఉదయం నుంచి నిర్వహించిన పలు ప్రత్యేక పూజలలో భక్తులు అశేషంగా హాజరయ్యారు. అనంతరం విగ్రహ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మెన్ బొర్ర జ్ఞానేశ్వర్, తెలంగాణ పత్రిక సంపాదకులు నీలకంఠం ముదిరాజ్, శ్రీనివాస్, ప్రచార కమిటీ కన్వీనర్ బానిస నారాయణ, సంగారెడ్డి జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు పత్రి రామకృష్ణ, హాజరయ్యారు.

మానవత్వం చాటిన కాంగ్రెస్ నేత

హైదరాబాద్ గాంధీ ఆస్పత్రి వద్ద వదిలి వెళ్లిన బంధువులు- హోప్ ఫౌండేషన్‌కు తరలింపు



వృద్దురాలితో రాకేష్ షెట్కార్

నారాయణఖేడ్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఐదుగురు కొడుకులు ఉన్నా 90 ఏళ్ల వృద్ధురాలైన కన్నతల్లిని సికింద్రాబాద్ గాంధీ వైద్యశాల సమీపంలో వదిలి పెట్టిన విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్ ఆమెను బుధవారం చేరదీసి హోప్ ఫౌండేషన్ కేంద్రంలో చేర్పించారు. నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన వృద్దురాలిని నెల రోజుల క్రితంగాంధీ వైద్యశాల సమీపంలో వదిలి పెట్టడంతో, ఆమె వచ్చి పోయే వారిని గమనిస్తూ వారి వైపు చూస్తుండడంతో, ఈ విషయం పత్రికల్లో వచ్చింది. దీంతో రాకేష్ షెట్కార్ ఆమె వద్ధకు వెళ్లి ఆమె వివరాలు తెలుసుకోవడానికి ప్రయత్నించారు. పేరు కాశమ్మ అని, ఐదుగురు కొడుకులు ఉన్నారని, నారాయణఖేడ్ ప్రాంతమని చెబుతున్నప్పటికీ, సొంత ఊరు పేరు చెప్పలేక పోతుంది. నా మనవడు ఇక్కడ వదిలిపెట్టి వెళ్లాడని తెలుపడంతో రాకేష్ షెట్కార్ ఆమెను పరామర్శించి, హోప్ ఫౌండేషన్ కేంద్రానికి తరలింప చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

పాత ఫోన్లతో పరేషాన్..!

- అంగన్‌వాడీ టీచర్లకు 2జీ ఫోన్లు
- యాప్‌లు పని చేయక ఇబ్బందులు
- వివరాల నమోదు ఆలస్యం

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చిన ఫోన్లు మోరాయిస్తున్నాయి. 2018లో 2జీ టెక్నాలజీ ఫోన్లను అంగన్‌వాడీ టీచర్లకు కేటాయించగా, ఆ ఫోన్లలో ఐసీడీఎస్ ఇస్తున్న యాప్‌లు వినియోగించుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. యాప్‌లో విద్యార్థి వివరాలు నమోదు చేయడానికి కొన్నిసార్లు రెండు రోజులు పడుతుండటంతో ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. అంగన్‌వాడీలో ఆధునిక సేవలను అందుబాటులో తీసుకువచ్చేందుకు 2018లో అంగన్‌వాడీ టీచర్లకు ఫోన్లను అందజేశారు. అప్పట్లో అవి 2జీ ఫోన్లు కాగా, మెమురీ కూడా 1.5 జీబీ మాత్రమే. దాదాపు ఏడు సంవత్సరాల క్రితం ఇచ్చిన ఈ ఫోన్లు ఇప్పటి అవసరాలకు ఏ మాత్రం సరిపోవడం లేదు. అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చిన ఫోన్లలో కేంద్ర ప్రభుత్వ పోషన్ ట్రాకర్, రాష్ట్ర ప్రభుత్వ ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌లు వినియోగించాల్సి ఉంటుంది. ఈ యాప్‌ల్లో వివరాలు ఎంటర్ చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, మెమొరీ సరిపోక యాప్‌లు పని చేయడం లేదని అంటున్నారు. అంతేకాకుండా అంగన్‌వాడీలో చేరిన పిల్లల వివరాలను గతంలో ఒకసారి నమోదు చేస్తే సరిపోయేది. అయితే, గత నెల నుంచి కొత్త రూల్ తీసుకువచ్చింది. అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న పిల్లల ఫోటోను క్యాప్చర్ చేసి, ప్రతీ నెల ఆధార్ కార్డులో సహా కేంద్ర ప్రభుత్వ యాప్‌లో ఎంటర్ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు పాతబడి పోవడంతో ఫొటోలు క్యాప్చర్ కావడం లేదు. విద్యారుల వివరాల నమోదు, ఫోటో క్యాప్చర్ కోసం రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో కొందరు తమ ఇళ్లలోని ఫోన్లలో.. మరికొందరు సొంతంగా ఫోన్లు కొనుగోలు చేసి వినియోగించాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి పాత ఫోన్ల స్థానంలో కొత్త టెక్నాలజీ ఫోన్లను అందించాలని పలువురు అంగన్‌వాడీ టీచర్లు కోరుతున్నారు.



ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



అంగన్‌వాడీ కేంద్రాల్లో అప్పట్లో ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లతో ఇబ్బందులు తలెత్తుతున్న విషయం దృష్టికి వచ్చింది. ఈ విషయాన్ని గతంలోనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. మళ్లీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. సమస్య పరిష్కారానికి మా వంతు ప్రయత్నం చేస్తున్నాం.

-శారద, సీడీపీవో

హోరా హోరీ

నారాయణఖేడ్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి ఉత్సవాలను పురస్కరించుకొని నారాయణఖేడ్‌లో బుధవారం నిర్వహించిన కుస్తీపోటీలు హోరాహోరీగా సాగాయి. నల్లరేగడి మట్టి నేలలో భగభగ మండే ఎండను సైతం లెక్కచేయకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మల్లయోధుల మధ్య జరిగిన పోటీలు ఉత్కంఠభరితంగా కొనసాగాయి. ఈ కుస్తీ పోటీలను తిలకించేందుకు జనాలు సైతం భారీగా తరలి వచ్చారు. స్థానిక రామాలయం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కుస్తీ పోటీలకు కర్ణాటక, మహారాష్ట్రతోపాటు ఖేడ్ ప్రాంతంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వందలాది మంది మల్లయోధులు పాల్గొని తమ సత్తాను చాటుకున్నారు. స్థానిక రామాలయం ఆధ్వర్యంలో వంద సంవత్సరాలకు పైబడి ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు కూడా బందోబస్తు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వివేకానంద్, ఆలయ కమిటీబాధ్యులు పాండు, నిర్వాహకులు సాయిలుపటేల్, కన్నయ్యలాల్, సంజీవ్, భరత్‌సేత్, మదన్‌లాల్, తదితరులు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై రాములోరి ఊరేగింపు

ఖేడ్‌లో రామ నవమి వేడుకల సందర్బంగా బుధవారం అశ్వవాహనంపై రాములోరిని ఊరేగించారు. కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక మండలి మాజీ సభ్యులు నగేష్ షెట్కార్, మాజీ చైర్మన్ ముత్యం హన్మండ్లు, వివేకానంద్, పాండు, తదితరులు పాల్గొన్నారు. సప్తాహ కార్యక్రమంలో భాగంగా కరణ్‌గజేంద్ర భారతి మహారాజ్ గాథ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.



కుస్తీపడుతున్న మల్లయోధులు

స్టేడియాలు మంజూరయ్యేనా ?

- నాలుగు చోట్ల ఏర్పాటు
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి ఆ శాఖ తన వంతు చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా క్రీడాప్రాధికార సంస్థ ఆధీనంలోని స్టేడియాలల్లో క్రీడల పరంగా ఏమేం అవసరమున్నాయే దానిపై ప్రతిపాదనలు రూపొందించిన ఆ శాఖ జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న స్టేడియాల్లో కోచ్‌లతో పాటు అవసరమైన క్రీడా పరికరాలు, సౌకర్యాల కల్పనపై దృష్టి సారించారు. అయితే ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక ఆధారంగా నిధులు మంజూరైతే జిల్లాలో క్రీడలు, క్రీడా మైదానాల అభివృద్ధికి మహర్దశ పట్టనుంది.

సంగారెడ్డిలోని డా.బి.ఆర్.అంబేద్కర్ స్టేడియం 7 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ స్టేడియంలో ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియాలతో పాటు సింథటిక్ ట్రాక్, స్టేడియం ఆధునీకరణ కోసం రూ.32 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. నారాయణఖేడ్ సమీపంలోని జుక్కల్ గ్రామంలో 5.21 ఎకరాల విస్తీర్ణంలో ఇండోర్, అవుట్ డోర్ స్టేడియాల ఏర్పాటుకు రూ.20 కోట్ల ప్రతిపాదనలు సమర్పించారు. పటాన్‌చెరు పరిధిలోని పాటిఘన్‌పూర్‌లోని ఐదెకరాల విస్తీర్ణంలో ఇండోర్, అవుట్ డోర్ స్టేడియాల ఏర్పాటుకు రూ.25 కోట్లు ప్రతిపాదించారు. ఈ మధ్యనే హత్నూరలో 4.20 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం క్రీడాప్రాధికార సంస్థకు కేటాయించగా, ఆ స్థలంలో ఇండోర్, అవుట్ డోర్ స్టేడియాల ఏర్పాటుకు సుమారు రూ.25 కోట్లు ప్రతిపాదనలు రూపొందించారు. ఇవే కాకుండా వివిధ క్రీడాంశాల్లో తర్ఫీదునిచ్చేందుకు కోచ్‌ను నియమించాలని కూడా ప్రతిపాదనలు పంపారు.



విజయ పథాన పాడి

- రైతులకు ప్రోత్సాహకాలు
- పాడిరైతులకు సంక్షేమ పథకాలు
- తాజాగా పాల సేకరణ ధర పెంపు
- ఈ నెల ఒకటి నుంచి వర్తింపు

మెదక్ అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పాడి పారిశ్రామికాభివృద్ధి సహకార సమాఖ్య(విజయ డెయిరీ) ద్వారా నాణ్యమైన పాల ఉత్పత్తిని పెంచేందుకు వివిధ సంక్షేమ పథకాలతో ముందుకు సాగుతోంది. పాడి రైతులకు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. విజయ డెయిరీ ద్వారా ఈ-ల్యాబ్‌లో పేరు నమోదు చేసుకున్న రైతులకు సంక్షేమ పథకాలు వర్తించనున్నాయి. పథకాలపై అవగాహన కల్పించడంతోపాటు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తూ వారిని చైతన్యవంతులను చేస్తూ, పాడి పరిశ్రమాభివృద్ధి కోసం అధికారులు కృషి చేస్తున్నారు. తాజాగా పాల సేకరణ ధరను పెంచింది. లీటర్ పాలకు విజయ డెయిరీ ద్వారా రైతుకు రూ.56 (వెన్న శాతం7)కు చెల్లిస్తుండగా..దీన్ని రూ.3.20 పెంచి లీటర్‌కు రూ.59.50పైసలు చెల్లించనున్నారు. 10 శాతం వెన్న ఉన్న పాలకు లీటర్‌కు రూ.80 ఉండగా.. పెంచిన ధరతో లీటర్ రూ.84.60పైసలకు చేరింది. ఆవు పాల ధర తగ్గించారు. అత్యధికంగా గేదె పాల సేకరణ జరగుతోంది. ఈనెల ఒకటో తేదీ నుంచే కొత్త ధరలు వర్తించనున్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి

రైతులకు విజయ డెయిరీ ద్వారా అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. పాడి రైతులకు ప్రీమియం ధర చెల్లించడంతోపాటు ప్రోత్సాహకాలను కూడా అందజేస్తోంది. పాడి రైతులను ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో సంస్థ పాల సేకరణ ధరను పెంచింది.

-గోపాల్ సింగ్, డీడీ
విజయ డెయిరీ



జిల్లాలో 5 వేల లీటర్ల పాల సేకరణ..

జిల్లాలో మెదక్, రామాయంపేట, చేగుంట, కౌడిపల్లి, పాపన్నపేట, పెద్దశంకరంపేట, రేగోడ్. యవాహూర్‌లలో మినీ పాలశీతలీకరణ కేంద్రాలున్నాయి. వీటికి తోడు 150 పాల సేకరణ కేంద్రాలు కొనసాగుతున్నాయి. జిల్లావ్యాప్తంగా 2 వేల మంది రైతుల ద్వారా నిత్యం 5 వేల లీటర్ల పాల సేకరణ జరుగుతుంది. ధర పెంపు కారణంగా బయటి వ్యక్తులు, సంస్థలకు వెళ్లే పాలు నేరుగా విజయ డెయిరీకి చేరుకోనున్నాయి. తద్వారా విజయ డెయిరీకి పాల సేకరణ పెరగడంతో రైతులకు ప్రయోజనం చేకూరనుంది. పెరిగిన ధర ప్రకారం పాడిరైతులకు నెలకు రూ. 4 లక్షలకు అదనపు ఆదాయం రానుంది.

విజయ డెయిరీ సంక్షేమ పథకాలు..

- విజయ పెళ్లి కానుక రూ. 5 వేలు.
- సబ్సిడీపై పశు దాణా. నట్టల మందులు అందజేత
- పాడి పశువులు కొనుగోలకు ముద్ర. పీఎంఈజీపీ ద్వారా సబ్సిడీ రుణాలు
- ఉచిత పశువైద్య శిబిరాల ఏర్పాటు.
- పాడి రైతులకు పాల సేకరణ ధర పెంపు, వర్తింపు.
- పాడి రైతు మరణిస్తే అంత్యక్రియల కోసం వియజ వైకుంఠదామం కింద రూ.5 వేలు అందజేత
- అధిక శాతం ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్ కలిగిన పాలకు ప్రీమియం ధర

'సఫాయి'లకు అందిన జీతం

● మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే

రామాయంపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు సఫాయి కార్మికులకు జీతాలు అందాయి. ఐదు రోజుల క్రితం వేతనాలు రాక పారిశుధ్య కార్మికులు భిక్షాటన చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు రెండు రోజుల్లో వేతనాలు వచ్చేలా చూస్తానని విధుల్లో చేర్పించారు. చెప్పిన మాట ప్రకారం బుధవారం ఒక నెల బకాయిలు అందడంతో కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు. అలాగే త్వరలో పీఎఫ్ బకాయిలు వచ్చేలా చూడాలని కార్మికులు కోరుతున్నారు.

వేతనాలు చెల్లించాలని జీపీ కార్మికులు భిక్షాటన



దుకాణంలో భిక్షాటన చేస్తున్న జీపీ కార్మికులు

మనోహరాబాద్ ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలంటూ భిక్షాటన చేస్తూ వారు నిరసన తెలిపారు. మనోహరాబాద్ మండలం జీడిపల్లి గ్రామంలో దుకాణాలకు వెళ్లి భిక్షాటన చేశారు. ఐదు నెలల నుంచి జీతాలు రాలేదని, దీంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. వేతనాలు చెల్లించకుంటే విధులకు వెళ్లకుండా నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు.

అవినీతి కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని వినతి

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : అవినీతికి పాల్పడిన కొండాపూర్ మండలం మన్సాన్‌పల్లి, మునిదేవునిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని టీసీపీఐ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సంగారెడ్డి కలెక్టరేట్‌లో డీఆర్‌వో పద్మజా రాణికి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ వెంచర్లకు అనుమతులు, ఇంటి నిర్మాణాలు చేపడుతున్న వారికి నోటీసులు ఇవ్వకుండా బిల్డర్‌లకు సహకరిస్తున్న పంచాయతీ కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు నేడు స్థల పరిశీలన

వెల్దుర్తి, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇల్లు నిర్మించుకునే వారికి తక్కువ ధరకే ఇసుకను సరఫరా చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు మండలంలోని హల్దీవాగుపై ఇసుకరీచ్‌లు ఏర్పాటు చేసేందుకు గురువారం స్థల పరిశీలన చేయనున్నట్లు తహసీల్దార్ కృష్ణ పేర్కొన్నారు. మైనింగ్‌శాఖ సూచనతో మండలంలోని వెల్దుర్తి, నెల్లూర్, ఉప్పులింగాపూర్, కొత్తపల్లి, కుకునూర్, దామరంచ హల్దీవాగుపై రీచ్‌లు ఏర్పాటు చేయనున్నామని, ఆయా గ్రామాల శివారులో మైనింగ్ శాఖ అధికారులతో కలిసి స్థలాలను గుర్తించనున్నట్లు తెలిపారు.

'డంపుయార్డు అనుమతులను రద్దు చేయాలి'

గుమ్మడిదల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : డంపుయార్డ్ అనుమతులను వెంటనే రద్దు చేయాలని మండల జేఏసీ నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గుమ్మడిదల మండల కేంద్రంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారంతో 64వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షకు గుమ్మడిదల సీజీఆర్ ట్రస్టు సభ్యులు వినోద్, రాము, రాజశేఖర్, పెంటారెడ్డి, మహేష్, సంఘీభావం తెలిపారు. నిరసన దీక్షలో మండల జేఏసీ సభ్యులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, కుమార్ గౌడ్, చిమ్ముల నరసింహ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, దోమడుగు బాల్ రెడ్డి, సంజీవరెడ్డి, అమ్మగారి సదానంద రెడ్డి, భిక్షపతి రెడ్డి, సూర్యనారాయణ, మంద భాస్కర్ రెడ్డి, గోపాల్, ఆంజనేయులు, చంద్రారెడ్డి, నల్తూరుయాదగిరి, చంద్రశేఖర్, ఆయుబ్, వినోద్, జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

16న పశువుల సంత వేలం

తూప్రాన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ మున్సిపల్ పరిధిలో పశువుల సంత నిర్వహణకు ఈ నెల 16న వేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వేలం ఉంటుందని తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికిగానూ ఈ నెల 17 నుంచి 2026 మార్చి 31 వరకు నిర్వహణకు పశువుల సంతకు వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



కాశీంపూర్ రోడ్డులోని మూలమలుపులు

ప్రమాదకర మలుపులు

● కనిపించనంతగా పెరిగిన చెట్ల కొమ్మలు
● సూచిక బోర్డులు ఏర్పాటు చేయని అధికారులు
● ప్రమాదాల బారిన వాహనదారులు

జహీరాబాద్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా పలు రోడ్ల మూలమలుపులు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. ముఖ్యంగా జహీరాబాద్ మండలంలోని కాశీంపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డుపై నాలుగైదు చోట్ల ప్రమాదకర మూలమలుపులు ఉన్నాయి. ఈ రోడ్డుపై ప్రమాదాలు చోటు చేసుకోవడం సర్వ సాధారణంగా మారింది. అసలే ఇరుకు రోడ్లు.. ఆపై చెట్లకొమ్మలు ఏపుగా పెరిగి మధ్యలోకి రావడంతో వాహనదారులు దగ్గరికి వచ్చేవరకూ మూలమలుపు కనపడడం లేదు. ఈ నేపథ్యంలో వాహనాలు అదుపుతప్పి పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇలాంటి డేంజర్ మూలమలుపుల వద్ద సూచిక, హెచ్చరికల బోర్డులు, రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేయాల్సిన అధికారులు మిన్నకుండిపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రమాద నివారణకు చర్యలపై రెండుమూడు రోజులపాటు హడావిడి చేస్తున్న అధికారులు.. ఆ తరువాత పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మూలమలుపుల వద్ద రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పొదలు, చెట్లు కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూలమలుపుల వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సముద్ర తరంగాల అస్థిరతలపై అధ్యయనం

● బ్రిటన్ నిపుణుడు డాక్టర్ అనిర్బన్ గుహ



మాట్లాడుతున్న డాక్టర్ అనిర్బన్ గుహ

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 9:(ఆంధ్రజ్యోతి): సముద్ర తరంగాల అస్థిరతలపై చేసిన పరిశోధన, అధ్యయనాంశాలను బ్రిటన్ డండీ విశ్వవిద్యాలయంలో పర్యావరణ ద్రవ మెకానిక్స్‌లో సీనియర్ అధ్యాపకుడు డాక్టర్ అనిర్బన్ గుహ వెల్లడించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'సముద్ర తరంగాల అస్థిరతల'పై బుధవారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. సముద్ర పొరలలో పదునైన సాంద్రత పొరలు, వాటి సుదూర అనువర్తనాల లోతైన అన్వేషణను సదస్యులతో పంచుకున్నారు. తొలుత, ప్రొఫెసర్ బీ.ఎం.నాయుడు అతిథిని స్వాగతించి, సదస్యులకు పరిచయం చేశారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా ఇతర అధ్యాపకులతో కలిసి డాక్టర్ గుహను ఘనంగా సత్కరించారు. కాగా, ఈ అతిథ్య ఉపన్యాస కార్యక్రమాన్ని డాక్టర్ లిమా బిశ్వాస్, డాక్టర్ వి.కామేశ్వర శ్రీధర్ సమన్వయం చేశారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రాజేశ్వర్

కంది, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ, మంచి భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని తెలంగాణ యాంటీ నార్కొటిక్ సోల్జర్స్, వ్యక్తిత్వ వికాస శిక్షకుడు కొంక రాజేశ్వర్ అన్నారు. బుధవారం ఆయన కందిలోని షైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రగ్ రహిత తెలంగాణ కోసం మనమందరం కృషి చేయాలన్నారు. ముఖ్యంగా టీనేజ్‌లోని విద్యార్థులు మాదకద్రవ్యాల వలలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా మాదక ద్రవ్యాల వినియోగిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రవీందర్, ప్రిన్సిపాల్ ఎం. కవిత, టీచింగ్ అసోసియేట్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన శివ్వంపేట యువకులు



కాంగ్రెస్‌లో చేరుతున్న యువకులు

శివ్వంపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన శివ్వంపేటకు చెందిన యువకులు బుధవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ ప్రవంతి నవీన్ కుమార్ గుప్తా ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి నవీన్ గుప్తా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు షేక్ అలీ, మల్లేష్, సంతోష్, నాగరాజ్, మోహిష్ తదితరులున్నారు

ఘనంగా సీతారాముల ఊరేగింపు



జిన్నారం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిన్నారంలో శ్రీరామ నవమి ఉత్సవాలలో భాగంగా గరుడ వాహన సేవను ఘనంగా నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున కోదండ రామాలయం నుంచి గ్రామ ప్రధాన వీధులలో గరుడ వాహన సేవపై సీతారాములను ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించగా.. రేపటితో నవమి ఉత్సవాలు పూర్తి కానున్నాయి.

ఆలయ నిర్మాణానికి భారీగా విరాళాలు

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిన్నశంకరంపేట నూతనంగా పెద్దిరాజు పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి దాతలు బుధవారం భారీ విరాళాలు అందజేశారు. అడ్వకేట్ ఆకుల శ్రీనివాస్ రూ.1లక్ష, మల్ల నారాయణ రూ.లక్ష, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగా నరేందర్ రూ.70 వేలు, మాజీ జడ్పీటీసీ మాధవి రాజు రూ.76 వేలు, వడ్ల వెంకటరాములు రూ.51 వేలు, సూరెడ్డి రామ్‌రెడ్డి రూ. 50 వేలను ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బాబుకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటేశం, సొసైటీ వైస్ చైర్మన్ నాగేష్, ముదిరాజ్ సంఘం నాయకులు రాధకిషన్, స్వామి, కుమార్, నవీన్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

● ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు



కొచ్చెర్వుతండాలో ఇందిరమ్మ ఇంటి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

హవేళిఘణపూర్, ఏప్రిల్ 9; అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు తెలిపారు. బుధవారం మండలంలోని కొచ్చెర్వు తండాలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో కొచ్చెర్వు తండాను మాడల్ ఇందిరమ్మ గ్రామంగా సెలెక్ట్ చేసి ఇళ్ల నిర్మాణం చేపడుతున్నమన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, తహసీల్దార్ సింధురేణుక, ఎంపీడీవో రవీశ్వర్ గౌడ్, సంగమేశ్వర్, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోషణ పక్షంపై అవగాహన కల్పించాలి

● జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



సంగారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పోషణ పక్షంపై గర్భిణీలు, చిన్న పిల్లలకు అవగాహన కల్పించాలని సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంవత్సరం మొదటి వెయ్యి ప్రాముఖ్యత, పోషణ ట్రాకర్‌లో లబ్ధిదారుల రిజిస్ట్రేషన్, పోషణ లోపం ఉన్న పిల్లలను గుర్తించి పర్యవేక్షణతో కూడిన అనుబంధ పోషక స్థితిని మెరుగుపరిచేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 22 వరకు జిల్లా వ్యాప్తంగా పోషణ పక్షం కార్యక్రమాలను కొనసాగించాలన్నారు. అనంతరం అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో లలితకుమారి, డీఆర్‌డీవో జ్యోతి, డీఎంఅండ్‌హెచ్‌వో డా. గాయత్రి, జడ్పీ సీఈవో జానకిరెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీకి నూతన భవనం నిర్మిస్తాం

కంది, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మామిడిపల్లిలో శిథిలావస్థలో అంగన్‌వాడి బిల్డింగ్‌ను తొలగించి నూతన భవనం నిర్మిస్తామని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం నాడు ఆయన కంది మండలం మామడిపల్లిలోని అంగన్‌వాడి కేంద్రాన్ని సందర్శించారు. ఆయన వెంట డీపీవో సాయిబాబా, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో మహేందర్ రెడ్డి, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న శ్రీనివాస్ రెడ్డి

చేగుంట ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే అన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతున్నదని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. చేగుంట మండలం రెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రెడ్డిపల్లి కాలనీలో బుధవారం సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం దశలవారీగా హామీలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నవీన్‌కుమార్, సొసైటీ చైర్మన్ మేకల పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజా శ్రీధర్‌రెడ్డి కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ



పాపన్నపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దౌలాపూర్ గ్రామానికి చెందిన రాజా శ్రీధర్‌రెడ్డి ఇటీవల మరణించాడు. ఈ మేరకు ఎమ్మెల్సీ అంజిరెడ్డి బుధవారం ఆయన ఇంటికి వెళ్లి కుటుంబీకులను పరామర్శించారు. ఆయన వెంట భాజపా జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి నందారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు రాములు, జిల్లా నాయకులు సంతోష్ చారి, నారాయణ, కిష్టయ్య, ఇమ్మాన్యుయెల్, సతీష్ తదితరులున్నారు.

రేషన్ దుకాణాలను కాంగ్రెస్ కార్యాలయాలుగా మార్చారు

● ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాలను కాంగ్రెస్ నాయకులు ఆ పార్టీ కార్యాలయాలు మార్చారని ఎమ్మెల్యే సునీతారెడ్డి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ సన్న బియ్యం పథకం పంపిణీ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు రేషన్ దుకాణాల వద్ద వారి ఫొటోలతో ఫ్లెక్సీలు పెట్టి పార్టీ కార్యాలయంగా మార్చారని ఆరోపించారు. ఏ మాత్రం నిబంధనలు, నియమాలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తు ప్రోటాకాల్‌ను పూర్తిగా నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, నాయకులు భిక్షపతి, ఆంజనేయులుగౌడ్, ప్రసాద్, వినయ్, సద్దాం, సాయి, సమీర్, సాకేత్ తదితరులు పాల్గొన్నారు. కాగా, నర్సాపూర్ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు హుస్సేన్ స్వగృహంలో నిర్వహించిన ఈద్ మిలాప్‌లో ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొన్నారు.

కెనాల్ భూనిర్వాసితులకు త్వరలో పరిహారం

● ఆర్డీవో మహిపాల్

నర్సాపూర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ డివిజన్‌లో సంగారెడ్డి కెనాల్ కోసం భూములు ఇచ్చిన రైతులకు త్వరలో పరిహారం ఇవ్వనున్నట్లు ఆర్డీవో మహిపాల్ తెలిపారు. బుధవారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ పరిధిలో నర్సాపూర్ మండలంలోని ఆరు గ్రామాలు, శివ్వంపేట మండలంలో తొమ్మిది గ్రామాల గుండి సంగారెడ్డి కెనాల్ వెళ్లనున్నట్లు చెప్పారు. అయితే ఇప్పటికే రైతులతో సమావేశాలు నిర్వహించి భూసేకరణ ప్రక్రియ 95శాతం పూర్తి చేశామని, త్వరలో పరిహారం కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. రెండురోజులలో రెడ్డిపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాల రైతులకు పరిహారం ఇవ్వాలని నిర్ణయించినట్లు ఆర్డీవో తెలిపారు. ఇదిలా ఉండగా ఆర్డీవో కార్యాలయంలో ఉద్యోగులకు రెవెన్యూఅసోసియేషన్ ఆధ్వర్యంలో డైరీలను ఆర్డీవో అందజేశారు. కార్యక్రమంలో ఏవో సహదేవ్‌తో పాటు ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిని నివారించాలని వినతి

కల్హేర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మార్డి గ్రామంలో నెలకొన్న తీవ్రమైన నీటి ఎద్దడిని నివారించాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం కల్హేర్ ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు ఎన్నం అనిల్‌రెడ్డి మాట్లాడుచూ వేసవి కాలం ప్రారంభంలోనే నీటి సమస్య తీవ్రంగా ఉందని, అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడమే ఇందుకు కారణమని విమర్శించారు. ఇప్పటికైనా నీటి ఎద్దడి నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అభిలాష్, అరవింద్, నర్సింహులు, రాజు, నాగరాజు పాల్గొన్నారు.

'బిడ్డకు తల్లిపాలే శ్రేష్టం'

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తల్లి ముర్రు పాలు పిల్లలకు శ్రేష్టమైనవని ఐసీడీఎస్ సూపర్వైజర్ అంజమ్మ అన్నారు. బుధవారం చిన్నశంకరంపేట మండలంలోని కొర్విపల్లి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు , బాలింతలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు ఎదుగుదల కోసం తల్లి పాలు తాపించాలన్నారు. బాలింతలు పోషక విలువలు కలిగిన ఆకు కూరలు, పండ్లు తినాలన్నారు.

సన్న బియ్యం పంపిణీపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం

● బీజేపీ మండలాధ్యక్షుడు రాజు

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రేషన్ షాపులకు సరఫరా చేస్తున్న సన్న బియ్యం పంపిణీపై కాంగ్రెస్ నాయకులు ప్రజలకు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, దన్ని సహించేది లేదని బీజేపీ మండలాధ్యక్షుడు చిన్న పట్లోరి రాజు అన్నారు. బుధవారం చిన్నశంకరంపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేదలకు కడుపు నిండా అన్నం పెట్టడమే లక్ష్యంగా రేషన్ షాపులకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నారన్నారు. రేషన్ షాపుల ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు రంజిత్‌రెడ్డి, సురేష్ గౌడ్, దశరథం, ఆకుల రాజు, మంజూల శివశంకర్, మధు, సతీష్, నర్సింహులు పాల్గొన్నారు.

జై బాపు.. జై భీం.. జై సంవిధాన్ యాత్ర



జహీరాబాద్ : చిరాగ్‌పల్లిలో పాదయాత్ర..

కల్హేర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి);బీఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని పరిరక్షించడం కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ ధనలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని బీబీపేట్‌లో కల్హేర్, నిజాంపేట మండలాలకు చెందిన నాయకులు బుధవారం జై బాపు, జై భీం, జై సంవిధాన్ ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ కల్హేర్, నిజాంపేట మండలాల అధ్యక్షులు పోచయ్య, శంకర్‌గౌడ్, మాజీ ఎంపీపీ మల్లేశం, నాయకులు పాల్గొన్నారు.

● కోహీర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని కాంగ్రెస్ పార్టీ కోహీర్ మండలాధ్యక్షుడు రామలింగారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పర్శిపల్లి, సిద్ధాపూర్‌తండా, గొటిగర్‌పల్లి గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు అనిల్ కుమార్ రాచయ్య, అష్రఫ్, అర్షద్, శఫీర్ అలీ, అలీమ్, సుదీర్‌కుమార్ తదితరులు ఉన్నారు.

● జహీరాబాద్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అసవరం ఉందని రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకుడు డా. సిద్దం ఉజ్వల్‌రెడ్డి పేర్కొన్నారు. చిరాగ్‌పల్లి, బూడ్దిపాడ్‌లో పాదయాత్ర నిర్వహించారు. అలాగే ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్నారు. మొగుడంపల్లి మండలంలో పార్టీ మండల అధ్యక్షుడు మక్సూద్ నేతృత్వంలో పాదయాత్ర చేపట్టారు. జహీరాబాద్ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి నేతలు పాల్గొన్నారు.

పెంచిన వంట గ్యాస్ ధరలను తగ్గించాలి



జహీరాబాద్ పట్టణంలో కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

నారాయణఖేడ్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పెంచిన వంట గ్యాస్ ధరలను తగ్గించాలని పలువురు నేతలు డిమండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఖేడ్‌లో సీపీఐ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో రాజీవ్ చౌక్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పార్టీ ఖేడ్ డివిజన్ కార్యదర్శి ఆనంద్, నాయకులు చిరంజీవి, అశోక్, దత్తురెడ్డి, పుప్పాల అశోక్, సతీష్, సంజీవ్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఖేడ్ పట్టణంలోని అంబేద్కర్ భవన్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఖాళీ సిలిండర్‌తో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఖేడ్ ప్రాంత కార్యదర్శి నల్లవల్లి రమేష్ మాట్లాడుతూ పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, కాన్షీరాం, కొటారి నర్సింలు, గణపతి, కృష్ణ, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

● జహీరాబాద్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు మైపాల్ కార్మికులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందించడంలో కాంగ్రెస్ విఫలం

● ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



చేగుంట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పంట పొలాలకు సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. చేగుంట మండల పరిధిలోని కసాన్‌పల్లి, పోతాన్ పల్లి, మక్కా రాజ్ పేట్ గొల్లపల్లి గ్రామాలకు వెళ్లే కెనాల్ కాల్వలను ఆయన బుధవారం సందర్శించారు. అనంతరం కెనాల్‌కు సంబంధించిన మ్యాపును అధికారులతో కలిసి పరిశీలించారు. కొన్ని చిన్న చిన్న కారణాలతో కెనాల్ కాల్వలకు నీళ్లు అందించలేకపోతున్నామని, ప్రభుత్వం సహకరిస్తే ఫారెస్ట్, ఆర్‌అండ్‌బీ సంబంధించిన రోడ్లు, అటవీ ప్రాంతంలో కాలువలు తవ్వి చెరువులను నింపే అవకాశం లభిస్తుందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ మోదం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే రుక్మాపూర్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు.